# పానుగోటి కృష్ణారెడ్డి



# విజేత

"దేవా! వస్తూ తా ఈ విషయము వింటివా?"

"ఏ విషయము చంద్రసేనా"

"మౌర్య సామ్రాజ్య స్థాపన జరిగి అర్ధ శతాబ్దమైననూ చిన్న చిన్న యుద్ధములు తప్పుట లేదుగదా! మొన్న జరిగిన యుద్ధములో గాయపడిన ఇరువురు దళాధిపతులు, కొంతమంది సైనికులు... ఇటీవల శరీరములు క్రుళ్ళిపోయి చనిపోయిరట."

"ఇదేమి విడ్డూరము! ఎన్ని యుద్ధములు జరుగుట లేదు? కదనరంగాన విజయలక్ష్మిని వరించుటయో, వీర స్వర్గము పొందుటయో, క్షతగాత్రులగుటయో జరుగుతున్నది గానీ, యుద్ధములో పాల్గొన్నవారి శరీరములు క్రుళ్ళిపోవుటయున్నది వింతగా యున్నది"

"మన అమాత్యులు కౌటిల్యుల వారు కూడా కలత చెందుతున్నారట."

"అసలేమైనదో"

"మొన్న జరిగిన యుద్ధములో వీరికి గాయములైనాయట. ఖడ్గములతో యుద్ధము చేయునప్పుడు గాయము లగుట సహజమే కదా! వానికి ఆకు పసరులు వాడినారట. వారము దినములు గడచిన పిమ్మట ఆ గాయమైన ప్రదేశముల నుంచి చీము వచ్చినదట. క్రమముగా శరీరమంతయూ అది ప్రాకి దేహమంతయూ క్రుళ్ళిపోయినదట."

"వైద్యులు ఏమనినారట?"

"చక్రవర్తి చంద్రగుప్తులవారు కూడా ఈ విషయమై కలతచెంది రాజవైద్యులుగారిని సైతం పంపినారట. అయిననూ ఫలితము లేకపోయినదట. ఇది ఏమియో క్రొత్త వ్యాధి అని రాజ వైద్యులు చెప్పినారట."

"అవునవును, వారన్నది యదార్థము. ఎన్ని యుద్ధములు జరుగుటలేదు!... ఎంత మంది క్షతగాత్రులు కాలేదు? ఇక ముందు ముందు కూడా ఇలాగే జరిగిన మానవ జాతికి మనుగడ లేనట్లే కదా!"

"అవునవును. మీరు పలికినది ముమ్మాటికీ సత్యము. ఈ క్రొత్త వ్యాధితో మానవ జాతి అంతరించిపోక తప్పదు."

* * *

"ముకరమ్ బాయ్... మీకీ విషయం తెలుసా?"

"ఏ విషయం?"

"మన నవాబ్‌గారి బేటాని హిమాలయాల ప్రాంతానికి పంపించారట."

"ఎందుకు?"

"దేశమంతా తెలిసినా నీకు తెలియదా? కుర్రాడికి ఏమయిందో తెలియదుగానీ! చిక్కి సగమైపోయాడు. శల్యమైపోయిన కుర్రాణ్ణి వైద్యులకు చూపించారు నవాబ్ సాబ్. వైద్యులు మందులు వాడారు. అయినా ఫలితం లేదు. కుర్రాడు దగ్గిదగ్గి... చివరకు నోట్లోంచి రక్తం కక్కుకునేవాడట."

"అరే... ఆశ్చర్యంగా వుందే!"

"అవును. క్షయ అని కొత్త జబ్బు అట."

"ఎలా వస్తుందో"

"ఏమో ఎవరికీ తెలియదు. ఎవరికైనా రావచ్చు. ఆ జబ్బు వున్నవాడు దగ్గితే ఆ గాలి పీల్చినా మనకు కూడా రావచ్చు."

"అయితే గాలి పీల్చకుండా ఎలా వీలవుతుంది బాయ్"

"అదేగదా బాధ! గాలి పీల్చకుండా బ్రతకడం సాధ్యం కాదు. వ్యాధి వచ్చాక బ్రతకడం వీలుకాదు. మరింక ఎట్లా చావాలి?"

"చేసేది ఏముంది? చావుకు సిద్ధం కావడమే."

"ఈ జబ్బుతో ఇక లోకంలో ఒక్కడు కూడా బ్రతకడనుకుంటాను."

* * *

"మన దొరగారు సీమకు వెళ్ళిపోతారట. నువ్వు ఇంకెక్కడన్నా పని చూసుకోవాల్సి వుంటది" వంటవాడు తోటమాలితో చెప్పాడు.

"ఏం"

"దొరసానికి ఏదో జబ్బు వొచ్చిందంట. ఆ జబ్బు వచ్చిన వాళ్ళు ఇంక బ్రతకడం కష్టం అంట. అందుకే దొరగారు చాలా దిగులుగా వుండారు. ఆమెకు సీమలో ఆపరేషన్ చేయించాలని- అక్కడికి వెళ్ళిపోవడానికి వైస్రాయిగారిని పర్మిషన్ అడిగారట దొరగారు. పర్మిషన్ రాగానే వెళ్ళిపోతారు."

"ఇంతకీ ఏందంట ఆ జబ్బు?"

"అదేదో పుండులాగా పుడుతుందంట. ఆ పుండు పెద్దదయి పెద్దదయి మనిషిని మింగేసద్దంట. కేన్సర అనో ఏదో జెప్పారు దొరగారు."

"ఎందుక నొస్తద్దంట."

"ఇంకా ఎవురికీ సరిగ్గా తెలియదంట. ఎవురికైనా రావొచ్చంట. తినే అన్నం గుండా రావొచ్చంట. పీల్చే పొగలో గుండా రావొచ్చంట. నీళ్ళల్లో గుండా రావొ

వ్చుంట. పొగదాగినా రావొచ్చుంట. అమ్మగారు సిగరెట్లు తాగతారు గదా. అయిదెచ్చినయ్య ముప్పు."

"వాళ్ళేవయింజేయిమ్మకోలేకపోతే ఇంక మన గతేంది?"

"ఏం వుంది? అదొస్తే చావడమే"

"అది అందరికి రాకా తప్పదు, పెపంచం నాశనం గాకా తప్పదు. బెమ్మంగారు జెప్పలా! పెపంచం వూడిచేసినట్టు పోద్దంటే ఇంకేందనుకున్నావు? ఇదే!"

* * *

రైలు అత్యంత వేగంగా పోతోంది.

ఆ కంపార్ట్‌మెంట్‌లో కూర్చున్న ప్రయాణికులంతా ఎవరి కార్యక్రమాలలో వాళ్ళున్నారు. కొందరు చదువు కుంటున్నారు. కొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు. కొందరు కిటికీల్లోంచి వెనక్కు వెళ్ళిపోతున్న ప్రకృతి దృశ్యాల్ని చూస్తున్నారు.

అప్పటి వరకు పేపర్ చదవడంలో నిమగ్నమై వున్న ఒకతను పెద్దగా అన్నాడు "ఇది చూశారా?"

"ఏమిటండీ" ఇద్దరు, ముగ్గురు ఒకేసారి ఆశ్చర్యంగా అడిగారు.

"కేరళలో ఓ మెడికల్ కాలేజి ప్రొఫెసర్ ఎయిడ్స్‌తో చచ్చిపోయాడట."

"అందులో ఆశ్చర్యం ఏముందండీ! బొంబాయి రెడ్ లైట్ ఏరియాలో ప్రతి పది మంది వేశ్యల్లో ఒకరికి ఎయిడ్స్ వుందంట. అంటే ఇప్పటికే దేశం అంతా ఎయిడ్స్ మయం అయిపోయి వుంటుంది. మనకు ఇప్పుడు తెలియదుగానీ మన ప్రక్కన తిరిగేవాడికి కూడా ఎయిడ్స్ వుండొచ్చు. నాలుగైదు సంవత్సరాలలో గానీ బయటపడదు."

"అదేమిటండీ, బొంబాయిలో ఎయిడ్స్ వుంటే దేశం అంతా ఎందుకు వుంటుందండీ"

## బెదురు

"ఎందుకండీ! దేవుణ్ణి ఊరేగిస్తున్న ఆ 'ఏనుగు' అలా ఒక్కసారిగా బెదిరి పోయిందీ?" ఒకాయన మరోవ్యక్తిని ప్రశ్నించాడు.

"మరేంలేదులెండి! దాని దృష్టి అరుగు మీద మంచున్న మా ఆవిడ మీద పడివుంటుందంటే!" తలవంచుకొని జవాబిచ్చాడా వ్యక్తి.

—బచ్చు వీరరాజు, రాజమండ్రి

"మీకు తెలియదులెండి, బొంబాయి, ఢిల్లీ లాంటి పట్టణాల మహాత్యం... దేశంలో చాలా మందికి బొంబాయిలో పనులుంటాయి గదా. అంతదాకా ఎందుకు! ఉదాహరణకు చెబుతా! దేశంలోని బట్టల వ్యాపారుల్లో సగం మంది బొంబాయి వెళతారు గదా కొనుగోలుకు. వీళ్ళల్లో చాలా మంది అక్కడికి పోయి చేసే పని ఏమిటనుకున్నారు? వీళ్ళ లగేజి ఏజంట్ రూమ్‌లో పడేయడం ఆ రెడ్ లైట్ ఏరియాకు పరిగెత్తడమే కదా!" ప్రక్కనున్న బట్టల కొట్టు మిత్రుణ్ణి క్రీగంట చూస్తూ అన్నాడు.

"ఇంత ప్రమాదం అని తెలిసి కూడా ప్రభుత్వం ఎందుకు గమ్ముగా వుందండి?"

"వుండక ఏం చేస్తుందండీ! డాలర్లు, పెట్రో డాలర్లు మన గవర్నమెంట్‌కి గావాలి. వాళ్ళకి అమ్మాయిలు గావాలి. ఏ దేశంలో ఎవుడికి మూడ్ వచ్చినా విమానం ఎక్కి ఇండియా వస్తుంటే..."

"ఏదో పూరెగివోళ్ళకి తగులుకుంటే పరవాలేదు. పాపం అన్నెం పున్నెం ఎరగనోళ్ళకి కూడా వస్తుంటే.. మీరు ఏ గవర్నమెంట్ ఆసుపత్రిలో నయినా చూడండి. ఒకే సిరంజిలోకి మందు ఎక్కించుకుని ఐదుగురికి చేస్తారు. సూది మార్చకుండా వందమందికి చేస్తారు. ఈ రోగుల్లో ఒక్కరికి ఎయిడ్స్ వున్నా అందరికీ వచ్చే ప్రమాదం వుంది... ఈ పని చేస్తున్నందుకు మనం నర్సుల్ని తిడతాం గానీ వాళ్ళు మాత్రం ఏం జేస్తారండీ! ఒక్క పూటకి రెండు, మూడొందల ఇంజక్షన్లు ఒక్కో నర్సు వెయ్యాల్సుంటే."

"గవర్నమెంటు ఏం గాడిదలు కాస్తుందండి" కోపంగా కేకలు వేశాడు ఒకతను.

"ఈయన్ని ఆయన, ఆయన్ని ఈయన తిట్టడానికే టైం చాలక వాళ్ళు వస్తుంటే మధ్యలో మీ గోల ఒకటి" నవ్వుతూ అన్నాడు ఒకతను.

ఈ విషయాలన్నీ వింటూ భయపడ్డ ఒకతను ప్రక్క అతన్ని అడిగాడు.

"ఈ వ్యాధి అందరికీ తగులుకోని ప్రపంచం నాశనం కావలసిందేనా?"

అప్పటివరకూ మౌనంగా అంతా వింటున్న అతను ఒక మందహాసం చేసి-

"పర స్త్రీలతో ఖుషీ చేయనంతవరకు, అధ్వాన్నమైన ఆసుపత్రులలో ఇంజక్షన్లు వేయించుకోనంతవరకు... ఏం కాదు. భయపడవలసిన పనే లేదు. మానవజాతి భయకంపితులను చేసిన మహా మహా వ్యాధులే ఈ మానవ శక్తి ముందు, మానవ మేధ ముందు ఓడి పోయాయి. ఇది ఎంత! మానవ ప్రభంజనం ముందు ప్రకృతే వణికిపోతోంది. మానవుడు ప్రకృతిని 'జయిస్తాడు'" అన్నాడు ఆత్మవిశ్వాసంతో.

రావిశాస్త్రిగారికి కృతజ్ఞతలతో

## వాస్తు వ్యాస పరంపర

# శుభ, అశుభ "శూలాలు"

ఇల్లు కట్టుకొనేటప్పుడు ముఖ్యంగా చూడాల్సిన వాటిలో ఈ శూలాలు ఒకటి. శూల అంటే నొప్పి అని చెప్పవచ్చు. వీథులు ఇంటికి ఏ ఏ విధాలుగా అమరి వున్నదానిబట్టి శుభ, అశుభ ఫలితాలు వున్నాయి.

ఇంటి స్థలానికి తూర్పు, ఈశాన్య మూలలోని వీథి శూల శుభం కలుగ చేస్తుంది. అదే విధంగా ఉత్తర, ఈశాన్య వీథి శూల కూడా మంచిదే. తూర్పు ఆగ్నేయ వీథిశూల మంచిది కాదు. దక్షిణ, ఆగ్నేయ వీథి శూల శుభ ఫలితాల్నిస్తే, దక్షిణ నైఋతి వీథి శూల అశుభ ఫలితాల్నిస్తుంది. పశ్చిమ నైఋుతి వీథి శూల మంచి ఫలితాల్నివ్వదు. మళ్ళీ పశ్చిమ, వాయువ్య వీథి శూల శుభ ఫలితాల్నిస్తుంది. ఉత్తర వాయువ్య వీథి శూల మంచి ఫలితాల్ని ఇవ్వదు.

బజారుకు ఎదురుగా వాకిలి వుండకూడదు. దీని మూలంగా గృహ యజమానికి కీడుకల్గుతుంది. దీన్నే రథ్యాశూల అంటారు.

మనం కట్టుకొన్న ఇంటికి ఏ దిక్కు మంచి గానీ ఇతర గృహాల వెన్ను తగల కూడదు. ఒకవేళ ఆ విధంగా తగులుతుంటే ఆ వెన్నుకు మన ఇంటి వెన్ను కలుసుకొనేట్లు చూడాలి. అది కుదరని పక్షంలో అవతలి యింటి వెన్ను మన ఇంటి వెన్నుకన్న ఎత్తుగా వుండేటట్టు పరిమాని మన యిల్లు ఎత్తు తగ్గించాల్సి వుంటుంది. ఇతరుల ఇంటి వెన్ను నిలువుగా వుంటే దానిననుసరించియే మన ఇంటి వెన్నుకూడా నిలువుగా వుంచుకునేట్లు చూసుకోవాల్సి వుంటుంది. దానికి అడ్డంగా వుంటే దాన్ని "వెన్ను శూల" అంటారు. మేడలు, అధునాతనంగా కట్టుకొనే ఇళ్ళకు "వెన్ను" ఉండదు. అందువల్ల నూతనంగా చేసే ఏ నిర్మాణాలకయినా దీని మూలంగా శూల ఏర్పడదు. ఇబ్బంది ఉండదు.

మన ఇల్లు డాబా ఇల్లయినా ప్రక్కనున్న ఇంటి వెన్ను సింహద్వారమునకు గానీ, ద్వారాల మధ్యకు గానీ వుండ కూడదు. దీనిమూలంగా ఆ గృహంలో నివసించేవాళ్ళు సంసార భంగాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

సింహద్వారానికి ఎదురుగుండా స్తంభాలు వుండకూడదు. ఇవి భార్యకు కీడును తెస్తాయి. సింహద్వారానికి ఎదురుగుండా దేవాలయం వుండరాదు. దీని మూలంగా అనేక విధాలుగా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. సింహద్వారానికి ఎదురుగుండా ధ్వజ స్తంభం కూడా వుండకూడదు.

మన సింహద్వారానికి ఎదురుగుండా బావి వుండకూడదు. దీనివల్ల దాన్లో నివసించే వారికి అపస్మారక రోగము కలుగుతుంది. దీన్ని కూప శూల అంటారు.

మన ఇంటికి ఎదురుగుండా ఏ విధమైన నీటి ప్రవాహము వుండకూడదు. దీన్ని ప్రవాహ శూల అంటారు. ఇది అశుభ ఫలితాల్నిస్తుంది. ఇంట్లో ఖర్చులు ఎక్కువగా వుంటాయి.

— "సాదిల"

(మైక్రోవేవ్ క్వార్టర్స్, వరంగల్)

(మిగతా వచ్చే వారం)